




ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

# జనం ముచ్చట

ఆదివారం, సెప్టెంబర్ 06, 2026 | తెలంగాణ | పేజీలు : 4



కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర విమర్శలు..



## కాంగ్రెస్ పాలనపై ఖమ్మంలో..

# భగ్గుమన్న విద్యార్థులు

### విద్యార్థులు, నిరుద్యోగుల హామీల అమలుకు ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ భారీ ర్యాలీ

**ఖమ్మం, సెప్టెంబర్ 5 (జనం ముచ్చట):** విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఖమ్మంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు,ఖమ్మం పేవిలియన్ గ్రౌండ్ నుంచి జడ్పీ సెంటర్ వరకు సాగిన ఈ నిరసన ర్యాలీలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో...

## సత్తుపల్లిలో...

# బీఆర్ఎస్ రణభేరి

**కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై సత్తుపల్లిలో విద్యార్థులు, నిరుద్యోగులతో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య భారీ ర్యాలీ**

**సత్తుపల్లి, జనం ముచ్చట:** ఎన్నికల సమయంలో యువత, విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తును మార్చేస్తామని యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "1000 రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై పోరుబాట" కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లిలో శనివారం భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువతతో కలిసి సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

**భారీగా తరలివచ్చిన యువత, విద్యార్థులు....**

స్థానిక ఆర్అండ్బీ గెస్ట్‌హౌస్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ఈ నిరసన ర్యాలీలో విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాం గ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ర్యాలీలో పాల్గొన్న వారు

# కాంగ్రెస్ పాలనపై ఖమ్మంలో.. భగ్గుమన్న విద్యార్థులు



(మొదటి పేజీ తరువాయి)

**కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసింది....**

ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటి విడుదల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇంజినీరింగ్ అడ్మిషన్ల సమయంలో నెల రోజుల్లో ఫీజు బకాయిలు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకోలేదని మండిపడ్డారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో కనీస వసతులు కూడా సరిగా లేవని ఆయన ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, సమయానికి పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు....




**యూత్ డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయి?**

ఎన్నికల సమయంలో ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లో యువతకు అనేక హామీలు ఇచ్చారని పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు. ప్రతి నెలా రూ.4,000 చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చి, మూడేళ్లు గడిచినా నిరుద్యోగ యువతకు ఆ ప్రయోజనం అందలేదని ఆరోపించారు. ఈ లెక్కన ఒక్కో నిరుద్యోగికి రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షల వరకు బకాయిలు పడుతున్నాయని పేర్కొన్నారు.అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని ఆయన అన్నారు. అయితే 1000 రోజులు పూర్తయినా ఆ హామీల అమలుకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. యువతను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాల నోటిఫికేషన్లు మాత్రమేనని, మిగిలిన నియామకాల్లో ఎక్కువ భాగం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రక్రియ ప్రారంభమై పూర్తయినవేనని పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు....

**యువత కోసం పోరాటం కొనసాగిస్తాం....**

విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, రాబోయే రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.
భారీ సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యువత, విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, భీరెడ్డి నాగచంద్ర రెడ్డి, బచ్చు విజయ్ కుమార్, కర్నాటి కృష్ణ, బత్తుల మురళీ ప్రసాద్, మక్బూల్, దేవభక్తుని కిషోర్, మాటేటి కిరణ్, నాగండ్ల కోటేశ్వరరావు, కోలిపొంగు వెంకటేష్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో బీఆర్ఎస్ రణభేరి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో సండ్ర వెంకట వీరయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు....



**100 రోజుల్లో లక్ష ఉద్యోగాల హామీ ఏమైంది?**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని సండ్ర వెంకట వీరయ్య గుర్తు చేశారు. అయితే, అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నప్పటికీ ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.
నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. మెగా డీఎస్సీ నిర్వహణ, జాబ్ క్యాలెండర్ ప్రకటన, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు....




**యూత్ డిక్లరేషన్ హామీలపై సండ్ర ప్రశ్నల వర్షం...**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన యూత్ డిక్లరేషన్‌లో యువత, విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చిందని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, విద్యా భరోసా కార్డులు, జిల్లాకో యూపీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు వంటి హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ఏ చర్యలు తీసుకుందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రుసుముల మినహాయింపు వంటి హామీల ను కూడా అమలు చేయాలని కోరారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆందోళన**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యా ర్థులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాయని సండ్ర వెంకట వీరయ్య ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభు త్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.గురుకుల విద్యా వ్యవస్థను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తుకు గురుకుల విద్య ఎంతో కీలకమని, ఈ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

**యువత భవిష్యత్తుతో చెలగాటం వద్దు....**

యువతకు ఇచ్చిన ప్రతి హామీపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. కేవలం ఎన్నికల సమయం లో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ని విస్మరించడం సరికాదన్నారు.
"విద్యార్థులు, నిరుద్యోగులు తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి" అని ఆయన అన్నారు. హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సండ్ర వెంకట వీరయ్య హెచ్చరించారు.

**రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పోరుబాట...**

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందు లో భాగంగానే సత్తుపల్లిలో విద్యార్థులు, నిరుద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించి యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను తక్షణమే అమ లు చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, విద్యార్థుల సమస్యల ను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కామ్రేడ్ గరిడేపల్లి వెంకటేశ్వర్లు 21వ వర్ధంతి సందర్భంగా ఘననివాళి

వైరా రూరల్ : జనం ముచ్చట

ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం పోరాడిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, పీడిత ప్రజల ఆశాజ్యోతి కామ్రేడ్ గరిడేపల్లి వెంకటేశ్వర్లు 21వ వర్ధంతిని విప్పలమడకలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి సీపీఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి కామ్రేడ్ గరిడేపల్లి వెంకటేశ్వర్లుకు ఘన నివాళులర్పించారు. ఈ వర్ధంతి సభకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు విప్పలమడక గ్రామ సీపీఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు....

**గరిడేపల్లితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న పోతినేని సుదర్శన్....**

సభను ఉద్దేశించి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ కామ్రేడ్ గరిడేపల్లి వెంకటేశ్వర్లుతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా గరిడేపల్లి వెంకటేశ్వర్లు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా ఆయన స్పందిస్తూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పరిపాలన పూర్తవుతున్నప్పటికీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాల కారణంగా విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే వామపక్ష ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ప్రజలందరూ



సీపీఎం పార్టీకి సహకరించాలని పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు....

**పేదల కోసం భూముల సాధనలో గరిడేపల్లి పాత్ర చిరస్మరణీయం...**

జిల్లా కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కామ్రేడ్ గరిడేపల్లి వెంకటేశ్వర్లు గ్రామ అభివృద్ధి, నిరుపేదల సంక్షేమం కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. విప్పలమడక గ్రామంలో నిరుపేద కుటుంబాలు, ఎస్సీ, బీసీ వర్గాల ప్రజల కోసం ప్రభుత్వంపై పోరాటం చేసి సుమారు 22 ఎకరాల భూమిని సాధించి, వారికి నివాస సౌకర్యం కల్పించేందుకు కృషి చేశారని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ, బీసీ వర్గాలకు సుమారు 15 ఎకరాల భూమిని మాన్యాలుగా పంపిణీ చేయడంలో గరిడేపల్లి వెంకటేశ్వర్లు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి కూడా ఎంతో గొప్పదని నున్నా నాగేశ్వరరావు అన్నారు. ప్రజలకు నిరంతరంగా మంచినీరు అందాలనే లక్ష్యంతో బావులు, బోర్లు ఏర్పాటు చేయించారని, దాదాపు మూడు దశాబ్దాలుగా గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ఆయన చేసిన కృషి ఎంతో కీలకమని కొనియాడారు.

**గరిడేపల్లి ఆదర్శాలను కొనసాగించాలి....**

గరిడేపల్లి వెంకటేశ్వర్లు కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడని వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను నేటి తరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో సీపీఎం పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు సూచించారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు తమ సహాయ సహకారాలను అందించి ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కామ్రేడ్ గరిడేపల్లి వెంకటేశ్వర్లు 21వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విప్పలమడకలో ప్రజల భారీ భాగస్వామ్యంతో విజయవంతంగా ముగిసింది. ఆయన చేసిన ప్రజాసేవలను, పేదల కోసం సాగించిన పోరాటాలను పలువురు నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

# జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సుగంధం సాంబశివరావు

నేలకొండపల్లి : జనం ముచ్చట

మండలంలోని రాజేశ్వరపురం భవిత కేంద్రంలో ప్రత్యేక ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సుగంధం సాంబశివరావు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. గత 15 సంవత్సరాలుగా దివ్యాంగ విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడంలో సుగంధం సాంబశివరావు విశేష సేవలు అందిస్తున్నారు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించి వారికి విద్యతోపాటు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. దివ్యాంగ పిల్లలు కూడా సమాజంలో ఇతరులతో సమానంగా



ఎదగాలనే లక్ష్యంతో వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తూ, విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు సాంబశివరావు తెలిపారు. తాను అందిస్తున్న సేవలను గుర్తించి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా తనకు సహకరించిన విద్యాశాఖ అధికారులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత అంకితభావంతో పనిచేసి దివ్యాంగ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న సుగంధం సాంబశివరావును పలువురు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందించారు. ఆయనకు లభించిన ఈ పురస్కారం రాజేశ్వరపురం భవిత కేంద్రానికే కాకుండా నేలకొండపల్లి మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## మోడీ దిమాగి నక్సల్స్ అరాచకపు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పోరాడటమే

### విప్లవోద్యమ నాయకురాలు సీతక్క మార్గంలో పయనించాలి

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం, జనం ముచ్చట

నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల వెల్లువలో ధర్మన్న 1969లో భార్య, పిల్లల్ని వదిలి అడవికి పోయాడని, ఇల్లందు, పాల్వంచ ప్రాంతాల్లో సాయుధ దళాలలో పనిచేశాడని, ఆయన జీవిత సహచరి సీతక్క కూడా 1972 ప్రాంతంలో అడవికిపోయి, రహస్య జీవితాన్ని కొనసాగించిందని, 2021 జనవరిలో ధర్మన్న పోలీస్ బూటకపు ఎన్ కౌంటర్లో అమరుడైనారని, బ్రాహ్మణ పల్లె లో మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, 85 సంవత్సరాల కు పైగా అడవిలో దళ సభ్యురాలుగా, నాయకురాలుగా పనిచేసి, డివిజన్, జిల్లా పార్టీ నాయకురాలు ఎదిగి 89 సంవత్సరాల వయస్సులో సీతక్క అమరురాలైనదని, వారిరువురి విప్లవ జీవితాలు ప్రజలకు,సమాజానికి, విప్లవోద్యమానికి ఆదర్శవంతమని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. శనివారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం లో ఎంఎస్పీ క్యాంపు లోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధురాలు, ఆదివాసుల ఆత్మబంధువు సీతక్క సంతాప సభ నుజిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన పోటురంగారావుప్రసంగిస్తూ,సీతక్క ధర్మన్నల కుమారుడు కృష్ణ మూడు సంవత్సరాల వయస్సులో, సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటూ, ఇద్దరు ఆడపిల్లలు బంధువుల దగ్గర పెరిగారని, వారు ఎన్నో కష్ట నష్టాలు పెరిగి పెద్దవారయ్యారని ఆయన అన్నారు. కామ్రేడ్ సీతక్క ధర్మల జీవితం ఆదర్శవంతమైనదని, తన కూతుర్ని కూడా పార్టీ నాయకురాలుగా తీర్చిదిద్దారని, కె. కల్పన మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకురాలని,ఆమె సహచరుడు కచ్చెల రంగారెడ్డి సిపిఐ ఎంఎల్ మాస్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా,కేంద్ర కమిటీ నాయకులుగా ఉన్నారని,సీతక్క కుమారుడు కృష్ణ పార్టీ సభ్యుడిగా ఉన్నారని, కుటుంబాన్ని పార్టీ నీడన నిలబెట్టిన గొప్ప విప్లవ సాంప్రదాయం కలిగిన కుటుంబమని ఆయన కొనియాడారు. సీతక్క ఆదివాసులను ఉద్యమ పదంలోకి,సాంస్కృతిక చైతన్యలోకి నడిపిన విప్లవ నాయకురాలని, జీవితాంతం పార్టీ జెండా నీడనే ఉంటూ,ఉద్యమాల స్ఫూర్తితో జీవిస్తూ అమరురాలైనదని ఆయన అన్నారు. ఆదివాసులపై ఫారెస్ట్ అధికారులతో పోరాటాలు నిర్వహించిందని,వెదురు కూలీలతో వెదురు బొంగు కార్మికుల వేతనం పెరగటానికి సమ్మెలు చేయించిందని అన్నారు. ఎన్నో ప్రజా పోరాటాలలో పాల్గొంటూనే సీతక్క ముఖ్యంగా,ఆదివాసి మహిళల జీవితాలలో సాంస్కృతిక చైతన్య కోసం కృషిచేసిందని ఆయన అన్నారు. ప్రధాని మోడీ విప్లవకారులను దిమాగీ నక్సల్స్ని అనాగరికంగా, ప్రజాస్వామికంగా, నియంతలాగా, వింత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు వ్యతిరేకిస్తూ పోరాడాలని ఆయన అన్నారు. కేంద్రంలో పుష్కరకాలం పరిపాలన చేస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైన మోడీ, దేశ సంపదను అధాని, అంబానీ, విదేశీ సామ్రాజ్యవాదులకు దోచిపెడుతూ, ప్రజా సమస్యలను పక్కదారులు పట్టించడానికి అరాచకం పద్ధతులలో కించపరుస్తూ మాట్లాడటం మోడీనే పెద్ద దేశద్రోహియని ఆయన విమర్శించారు. మోడీ పరిపాలనలో మునిపెన్నడూ లేనివిధంగా అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, పరీక్ష పేపర్ల లీకేజీలు ఘోరంగా జరుగుతున్నాయని సూత్రధారులను, పాత్రధారులను ప్రభుత్వమే దాచిపెడుతుందని, వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఢిల్లీ, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలలో జన్ జడ్ ఉద్యమకారులు మోడీ ప్రజా వ్యతిరేక పరిపాలనను చాటి చెప్పినారని వారి మీద తప్పుడు కేసులు పెట్టి జైల్లల్లో నొక్కటం, తల్లిదండ్రులను వేధించటం ప్రజాస్వామ్య వ్యతిరేకమైన పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చెల. రంగారెడ్డి మాట్లాడుతూ, సీతక్క తన జీవితాంతం నిస్వార్థంగా, ఆదివాసుల కోసం, కొండరెడ్ల కోసం,పేద ప్రజల కోసం వారి మీద జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా తను,తన భర్తతోపాటు ఎన్నో విలువైన పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసి మహిళపై జరుగుతున్న అఘాయిత్యాలు, భూఆ క్రమనలకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిర్వహించిందని ఆయన కొనియాడారు. రాష్ట్రంలో 1000 రోజుల కాంగ్రెస్ పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఏవి కూడా నెరవేర్చకుండా మాటలకే పరిమితమైన రేవంత్ రెడ్డి పరిపాలనలో విఫలమైనారని విమర్శించారు. రాష్ట్రంలో ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి,రైతులు పంటలు వేయక వేసిన పంటలు ఎండిపోయి తీవ్రమైన ఇబ్బందులలో ఉంటే,మాటల గారడీలు చేస్తూ రోజులు గడుపుతున్నారని,అవే వేయి రోజుల పరిపాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు ఉపయోగించే నిత్యవసర సరుకుల ధరలు 50 శాతం అధికంగా పెంచి ఇప్పటికే అనేక భారాలతో కుంగిపోతున్న పేద ప్రజల పైన మరిన్ని భారాల మోపి అదో పాతాళానికి వెళుతున్నారని ఇది దారుణమైన విధానమని ఆయన విమర్శించారు.